క్లుప్తంగా

విద్యా సదస్సు విజయవంతం చేయండి

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఆదివారం జరగనున్న విద్యా సదస్సును విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు టి. ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యా సదస్సుతో పాటు ఇటీవల పదవీ విరమణ పొందిన వారికి అభినందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఏపీటీఎఫ్ అధ్యక్షుడు, ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం మంజూరు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరింత జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సి ఉందన్నారు. గ్రామ సచివాలయాల వారీగా పథకాలు, లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఓపీఆర్డీ పద్మజ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మెట్టూరు ఆర్ఆర్ కాలనీలో బోరు తవ్వుతున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్ఆర్ కాలనీలో మండల పరిషత్ నిధులతో రెండు బోర్లను ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు మంజూరు చేశారు. బోర్ల తవ్వకాన్ని ఎంపీటీసీ సభ్యుడు పొడ్డిన సింహాచలం శనివారం ప్రారంభించారు. ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు బోర్లు తవ్విస్తున్నట్లు తెలిపారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి



క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఫోరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సరుబుజ్జిలి: క్రైస్తవుల సంక్షేమానికి అందరూ కలిసికట్టుగా కృషి చేద్దామని క్రిస్టియన్ రైటర్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రెసిడెంట్ శామ్యూల్‌అరుణ్ కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తకోట పాస్టర్ సద్రక్‌బాబు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. క్రైస్తవుల శ్మశానవాటికలు, కమ్యూనిటీ హాల్స్, చర్చిల నిర్మాణాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఉత్తమ సేవలకు గాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు పొందిన అరుణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


పరామర్శ..



ఎంఈఓను పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్

మెళియాపుట్టి: వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడును శనివారం పాతపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పరామర్శించారు. ఆదినాయుడు కుమారుడు అనారోగ్యంతో బాధపడుతన్నాడనే విషయాన్ని తెలుసుకుని ఆస్పత్రినికి వెళ్లి ధైర్యం చెప్పారు. మెళియాపుట్టి ఎంఈఓ సవర దేవేంద్రరావు తల్లి గంగమ్మ ఇటీవల మృతిచెందారు. గొడ్డ గ్రామంలోని ఎంఈఓ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న బెడ్స్ కో ఆర్డినేటర్ జగన్నాథం

పాతపట్నం: స్థానిక దువ్వారివీధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ జగన్నాథం, హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధిత చట్టం–2006 ప్రకారం 18 ఏళ్లు నిండని బాలికలకు, 21 ఏళ్లు నిండని బాలురుకి వివాహం చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడితే అలాంటి వారిపై పోక్సో కేసు నమోదు అవుతుందన్నారు. తారకరామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రియంవద, మహిళా పోలీస్ సంతోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు
- పారదర్శక పాలనతో ప్రగతి పథంలో గ్రామాలు
- ప్రతీ పల్లెలో మౌలిక వసతుల కల్పన
- జగనన్న లే అవుట్లలో నూతన గృహాల ప్రారంభం



కిలంత్రలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని అల్లెన పంచాయతీ పరిధి కిలంత్ర గ్రామంలో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటింటికీ మంచినీటి కుళాయిలను శనివారం ప్రారంభించారు. అల్లెన గ్రామంలో రూ.20 లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను ప్రారంభించారు. అనంతరం అల్లెన గ్రామంలో జగనన్న లే అవుట్‌లో నూతనంగా నిర్మించిన గృహాలను ప్రారంభోత్సం చేశారు. బూర్జ గ్రామంలో రూ.21.80 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అన్నంపేట పంచాయతీ జంగాలవలస గ్రామంలోని అర్హులైన 19 మంది గిరిజన రైతులకు (18 ఎకరాల అసైన్డ్ భూమి) భూ పట్టాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని ప్రతీ నిరుపేదకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని అందజేసి వారికి ఆర్థికంగా చేయూత అందించాలనే లక్ష్యంతో పలు భూసంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా అల్లెనలో మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గాలి ఎంత ముఖ్యమో స్వచ్ఛమైన నీరు కూడా అంతే అవసరమన్నారు. రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి పంట సాగుకు ఆర్థికసాయం అందిస్తూ రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్, మండల కన్వీనర్ల కో ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, స్థానిక సర్పంచ్‌లు ఏగు అనురాధ, పెదలంకాం గ్రామ సర్పంచ్ కాగితాపలి గోవిందరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అల్లెనలో సీసీ రోడ్డు, కాలువను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

గ్రామాల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం



ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ బాండ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు:

గ్రామాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని ఎన్నిరామన్నపేటలో జిల్లా పరిషత్ నిధులు రూ.13.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతోపాటు పథకాల నిధులతో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రోడ్లు, సిమెంట్ కాలువలు, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ బాండ్ల పంపిణీ..

కొత్తూరు: మహిళలను సంపన్నులను చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ బాండ్లను శనివారం పంపిణీ చేశారు. కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కామక భాగ్యవతి, కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, కుంచాల రత్నాలు, ఎంపీటీసీ సభ్యుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, తహసీల్దార్ ప్రసాదరావు, ఏఓ రాంబాబు, పలువురు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాకనాపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని సిరియాఖండి గ్రామ సచివాలయం పరిధిలోని మాకనాపల్లి, దుర్భలాపురం గ్రామాల్లో శనివారం పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం జగనన్న అని అన్నారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, పింఛన్ కానుక, ఇంటి స్థలం, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాయన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్ ప్రభుత్వం ఖాయమన్నారు. పలువురు మహిళలు మాట్లాడుతూ.. జగనన్న పాలనలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన సమయంలో ఆయన బినామీలే లబ్ధి పొందారన్నారు. జగనన్న ప్రభుత్వంలో పేదలు ఎంతో మేలు జరిగిందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇంతమేలు జరగలేదన్నారు. మళ్లీ, మళ్లీ జగనన్నే మాకు సీఎంగా కావాలని, రెడ్డి శాంతి ఎమ్మెల్యేగా మాకు తోడుండాలని వృద్ధులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ తాడేల వజ్రమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి శ్రావణ్, రెడ్డి ఓం శ్రీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, జయమునిరావు, టి.ప్రసాదరావు, బమ్మిడి పున్నయ్య, శశిభూషణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో ఇద్దరు అరెస్టు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్ ఆర్ కాలనీలో పెదకోట తివిటినాయుడు పాన్ షాపులో శనివారం స్థానిక ఎస్‌ఐ ఎంఏ అహమ్మద్ తనిఖీలు నిర్వహించారు. 13 మద్యం సీసాలు అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిపారు. తవిటినాయుడును అరెస్ట్ చేశామన్నారు.

80 మద్యం బాటిళ్లతో..

హిరమండలం మండలం పరిధి ఎం.అవలంగి గ్రామం వద్ద స్థానిక సెబ్ స్టేషన్ ఎస్‌ఐ శ్రావణి తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఎం.అవలంగికి చెందిన బాలరాజు 80 మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొందూరు: మండలంలోని పొందూరు, లోలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.భయ్యన్నాయుడు, స్థానిక ఏఈ పి.దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు తెలిపారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 3 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

తాడివలస బీఎల్ఓపై విచారణ

పొందూరు: మండలంలోని తాడివలస పంచాయతీలోని పోలింగ్ బూత్ 134కు సంబంధించిన బీఎల్ఓ ఉమామహేశ్వరిపై సర్పంచ్ తమ్మినేని మనెమ్మ ఇటీవల ఫిర్యాదు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయంలో ఈఆర్వో అప్పారావు, తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్ శనివారం విచారణ చేపట్టారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. దీనిపై పూర్తి నివేదికలను ఉన్నతాధికారులకు, ఎన్నికల సంఘానికి నివేదిస్తామని చెప్పారు.

హిందీలో మంచి మార్కులు పొందవచ్చు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులు హిందీలో చిన్నపాటి మెలకువలు పాటిస్తే మంచి మార్కులు పొందవచ్చని సుందరాపురం స్కూల్ హిందీ ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సత్యవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ప్రత్యేక తరగతిని నిర్వహించారు. ఎలా చదివితే మంచి మార్కులు వస్తాయి.. ఎలా జవాబులు రాస్తే మంచి మార్కులు పొందవచ్చు అనేది వివరించారు. ఒత్తిడికి గురికావొద్దని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి శనివారం తెలిపారు. 2023–24లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 ఫీజు ఉంటుందన్నారు. మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాతపట్నం మోడల్ స్కూల్ పని వేళల్లో సంప్రదించాలన్నారు.

పేదల చదువుకు సీఎం జగన్ అండ



ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి, సామాన్య కుటుంబాలకు చెందిన వారి పిల్లల చదువుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఏడాది విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులు ప్రభుత్వమే భరిస్తూ వస్తుందని, ఇచ్చిన మాట ప్రకారం కచ్చితమైన సమయంలోనే వారి ఫీజు బాకీలు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక కిట్లు, విదేశీ విద్య, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద.. ఇలా అన్ని పథకాలకు అవసరమైన చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని గుర్తు చేశారు. పాతపట్నం నియోజకవర్గంలో 2023–24 సంవత్సరానికి మొదటి విడతగా జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 6,046 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల ఖాతాల్లో రూ.4.13కోట్లు జమచేశారన్నారు. వీరిలో ఎల్.ఎన్.పేట మండలం నుంచి 961 మంది విద్యార్థులకు రూ.64 లక్షలు, హిరమండలంలో 842 మంది విద్యార్థులకు 56 లక్షలు, కొత్తూరులో 1,752 మంది విద్యార్థులకు 1.21 కోట్లు, మెళియాపుట్టి మండలంలో 1,090 మంది విద్యార్థులకు రూ.73 లక్షలు, పాతపట్నం మండలంలో 1,401 మంది విద్యార్థులకు రూ.99 లక్షలు జమ చేశారని వివరించారు. చంద్రబాబు హయాంలో విద్యార్థులకు బాకీలు ఉంచి వారితోనే కట్టించేవారని ఆరోపించారు. కాలేజీల ఫీజులు చెల్లించకపోతే విద్యార్థుల సర్టిఫికెట్లు ఇచ్చేవారు కాదన్నారు. ప్రజలకు మేలు చేసేలా పరిపాలన అందివ్వటమే జగనన్న లక్ష్యంగా తీసుకున్నారన్నారు. ప్రజలకు మోసం చేసి అధికారమే లక్ష్యంగా మాయమాటలు చెపుతూ మరోసారి ప్రజల వద్దకు వస్తున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

‘నార.. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం’



క్షేత్రస్థాయిలో నారపంటలను పరిశీలిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: నార పంటల నుంచి తయారుచేసిన ఉత్పత్తులను, వాటి వినియోగాన్ని పెంచాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ ఎస్.మల్లికార్జున రెడ్డి, డాక్టర్ బి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. వారు శనివారం ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గోగు, ఇతర నార పంటలపై జరుగుతున్న వివిధ పరిశోధన, విస్తరణ అంశాలను పరిశీలించారు. అనంతరం ఆత్మ శ్రీకాకుళం సౌజన్యంతో నిర్వహిస్తున్న నార ఉత్పత్తుల విలువ జోడింపు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం బాగా పెరుగుతున్న నేపథ్యంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నార పంటల నుంచి తయారుచేసిన వివిధ ఉత్పత్తులను వాడుకోవాలని సూచించారు. దీనివల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడంతో పాటు నార పంటల సాగు చేసే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఆత్మ పథక సంచాలకులు డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ నార సాగుపై దృష్టి సారించి విస్తీర్ణం పెంచాలని సూచించారు.

సరిహద్దులో ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న డీఎస్పీలు బాలచంద్రారెడ్డి, మాధవనంద నాయక్

పాతపట్నం: ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, గజపతి జిల్లా (ఒడిశా) డీఎస్పీ మాధవనంద నాయక్ అన్నారు. పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం రాత్రి టెక్కలి డీఎస్పీ, గజపతి జిల్లా (ఒడిశా) డీఎస్పీ, పాతపట్నం సీఐ నల్లి సాయి, పర్లాకిమిడి సీఐ (ఐఐసీ) ప్రశాంత్ కుమార్ భూపతి ఆధ్వర్యంలో పోలీస్ అధికారుతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర సరిహద్దులో చెక్ పోస్టలు ఏర్పాటు చేయటంతోపాటు మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునేలా పనిచేయాలన్నారు. రెండు రాష్ట్రాల (పాతపట్నం, గజపతి జిల్లా) పోలీసులు పరస్పరం సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ సాఫీగా ఎన్నికలు సాగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో పర్లాకిమిడి, గారబంద, కాశీనగర్, కొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



సరుబుజ్జిలి: పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వేణమ్మ



జలుమూరు: పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్యామలరావు

సరుబుజ్జిలి: గోనెపాడు గ్రామానికి చెందిన సనపల గరికప్ప అనారోగ్యంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈయనకు వృద్ధాప్య పింఛన్‌ను గ్రామ వలంటీర్ గొండు వేణమ్మ శనివారం ఆస్పత్రికి వెళ్లి అందజేశారు.

40 కిలో మీటర్లు వెళ్లి..

జలుమూరు: మండల పరిధి అల్లాడ గ్రామానికి చెందిన పాత్రుని గున్నమ్మ అనారోగ్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రితో చికిత్స పొందింది. ఇటీవల శ్రీకాకుళంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటోంది. గ్రామానికి చెందిన వలంటీర్ గంగాధర శ్యామలరావు ఆమెకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

రిమ్స్‌కు వెళ్లి..

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 20వ వార్డు వెంగళరావుకాలనీకి చెందిన రేగిశెట్టి సూర్యనారాయణ అనే వృద్ధుడు అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ వార్డుకు చెందిన వలంటీర్ బూర్లె అశ్వని శనివారం ఆస్పత్రికి వెళ్లి సూర్యనారాయణకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.



ఆమదాలవలస: పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అశ్విని

మోడల్ స్కూల్ సందర్శన



పుస్తకాలను పరిశీలిస్తున్న పాయల్‌రౌత్

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట మోడల్ స్కూల్‌ను కైవల్య ఫౌండేషన్ స్టేట్ లెవెల్ పరిశీలకురాలు పాయల్ రౌత్ శనివారం సందర్శించారు. తొమ్మిదో తరగతి పిల్లలతో ముచ్చటించారు. లెసెన్ ప్లాన్, పాజిటివ్ థింకింగ్, టైమ్ మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలించారు. సైన్స్‌లాబ్, కంప్యూటర్ లాబ్, లైబ్రరీలను తనిఖీ చేశారు. ఎస్ఎస్‌ఏ ఏఎంఓ లక్ష్మీనారాయణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్, సీఆర్‌ఎంటీ పి.వసంత తదితరులు పాల్గొన్నారు. అలాగే జీసీడీఓ నీరజ పాఠశాలను సందర్శించి ఒకేషనల్ ఎడ్యుకేషన్ లాబ్‌ను తనిఖీ చేశారు.

రహదారి నిబంధనలు పాటించాలి

ఆమదాలవలస: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో రైల్వే అండర్ టన్నల్ వే వద్ద శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. క్షణికావేశంతో తల్లిదండ్రుల ఆశయాలకు తూట్లు పొడుస్తూ యువకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అధిక స్పీడ్‌తో వాహనాలు నడపొద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని సూచించారు. 18 ఏళ్లు నిండని వారికి తల్లిదండ్రులు బైక్‌లు ఇవ్వొద్దన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆమదాలవలస:

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సూచించారు. ఆమదాలవలస పట్టణంలోని మెట్టక్కివలస–1 సచివాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉద్యోగులు, ఆ ప్రాంత వాసులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. లింగ వివక్ష, స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసాలు లేకుండా మెలగాలని సూచించారు. బార్ అసోసియేషన్ మెంబర్స్ పి.వి.నరసింహులు, హనుమంతు అచ్చున్నాయుడు, సచివాలయం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు వివరాల ప్రదర్శన



పంట నమోదు వివరాలను ప్రదర్శిస్తున్న ఏఓ ధానకర్ణుడు

మెళియాపుట్టి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు వివరాలను ప్రదర్శిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ధానకర్ణుడు అన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు వివరాలను శనివారం ప్రదర్శించారు. స్థానిక రైతులకు దీని ద్వారా కలిగే లబ్ధిని వివరించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వేసుకున్న పంట వివరాల నమోదులో ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. అన్ని ఆర్బీకేల పరిధిలోని రైతులు గ్రామ సభల్లో కూడా తెలియజేయవచ్చన్నారు. వీఏఏ త్రివేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జయమునిరావు, పలువురు రైతులు ఉన్నారు.